

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**వెంటనే** ఆమెకి పింగ్ చేసాడు. కింద కుడివైపు ఛాటింగ్ బాక్స్ ఓపెన్ అయ్యాక అందులో 'హి' అని టైప్ చేసాడు.

"హా" జవాబు టైప్ అయి కనపడింది.

"దేనికి మీరు నన్ను హేట్ చేసేది?" ఇంగ్లీష్‌లో టైప్ చేసి కీ బోర్డ్‌లోని ఎంటర్ బటన్‌ని నొక్కాడు. అది వెళ్ళిన చాలా సేపు 'స్ఫూర్తి ఈజ్ టైపింగ్' అనే సైన్ వచ్చింది. తర్వాత 'స్ఫూర్తి ఎంటర్డ్ ది టెక్స్ట్' అని కనిపించింది. కొన్ని క్షణాల తర్వాత ఆమె టైప్ చేసింది కనిపించింది.

H - హేపీ టు టాక్ టు యు

A - ఆల్వేస్ మిస్ యు

T - థింకింగ్ ఆఫ్ యు

E - ఎవ్విరి డే ఐ రిమెంబర్ యు

సో, ఐ హేట్ యు.

"దట్సే గుడ్ ఒన్. వై నాట్ వి మీట్ సమ్ టైమ్?"

"మా నాన్నగారు ఒకప్పుడు 'డు ఆర్ డై' అనేవారు. మధ్యలో 'డు బిఫోర్ యు డై' అనేవారు. ఇప్పుడు 'డోంట్ డై అంటిల్ యు డు' అంటున్నారు. కలుద్దాం. ఆ విషయంలో మీ భవిష్యత్ గురించి చెప్పనా?"

"చెప్పండి."

"ఈ కింది జంతువుల్లో ఒకటి ఎన్నుకుని చెప్పండి. నేను కరెక్ట్‌గా నా అనాలిసిస్ చెప్తాను. 1. పీకాక్, 2. పేరట్, 3. క్రో, 4 ఓల్, 5 పిజియన్.

పీకాక్‌ని కాపీ చేసి పేస్ట్ చేసి ఎంటర్ కొట్టాడు త్రివిక్రం.

"మీరు మూర్ఖులు కాబట్టి మీకు మంచి భవిష్యత్ లేదు."

"అది ఎలా నిర్ణయించారు?"

"పీకాక్ జంతువు కాదు. పక్షి అని తెలీని మీరు మూర్ఖులు. మరి ఇంక ఎలా ఎదుగుతారు?"

అది ట్రిక్కీ క్వశ్చన్ అని అప్పుడు అర్థమైంది త్రివిక్రంకి.

"మా నాన్నగారు నా పుట్టినరోజుకి ఏం కావాలని అడిగారు. నేను ఎక్కగానే ఐదు క్షణాల్లో జీరో నించి ఎనభై అంకె మీదకి ముల్లు వెళ్ళే వస్తువుని కొనివ్వమన్నాను. నాకేం కొనిచ్చారో తెలుసా?"

"స్కూటర్, మోపెడ్‌లు అంత తక్కువ సమయంలో అంత వేగాన్ని అందుకోలేవు. మారుతి సుజుకి కూడా అనుమానమే. ఎస్ యు వి?"

"రాంగ్ గెస్. వెయింగ్ మెషీన్."

ఫక్కున నవ్వాడు త్రివిక్రం.

"విచ్ ఎక్స్‌ప్లెయిన్స్ దట్ యు ఆర్ ఓవర్ వెయిట్ అండ్ యువర్ డేడ్ ఈజ్ ఏ మైసర్.."

"అండ్ మై డేడ్ ఈజ్ క్లెవరర్ దేన్ యు." జవాబు టైపై వచ్చింది.

"అపేరెంట్లీ."

"అండ్ ఏ స్టుపిడ్ హజ్బెండ్ ఈజ్ ఆల్వేస్ బెటర్ దేన్ ఏ క్లెవర్ ఫాదర్. మీరైతే ఎస్ యు వి ని ఎంచక్కా కొనిచ్చేవారు కదా?"

"మీరు తెలివిగల అమ్మాయి."

"వారసత్వం."

"వాట్స్ న్యూ?"

"ఏరోప్లేన్ రాకెట్‌ని అడిగిందట, 'నువ్వు నాకన్నా వేగంగా వెళుతున్నావు? ఎందుకంత కంగారు?' అని. అందుకు రాకెట్ జవాబు చెప్పిందట. 'నీ కాళ్ళ దగ్గర నిప్పు పెడితే నీకే తెలుస్తుంది' అని. కీప్ స్మైలింగ్ అండ్ గుడ్‌నైట్ అగైన్."

"ఐ లవ్ యూ." ధైర్యం చేసి టైప్ చేసి పంపాడు.

"అలాగా? అది పెళ్ళిదాకా వెళితే మరో చరిత్ర, లేదా రక్తచరిత్ర."

"వెయిట్.. నీలాంటి అమ్మాయి, నాలాంటి అబ్బాయిని ఈజిప్ట్‌లోని పిరమిడ్‌ల దగ్గర అడిగిందట. 'నా కోసం నువ్వేం చేయగలవు?' అని.

"పిరమిడ్‌ల వెనక్కి రా. నిన్ను మమ్మీని చేస్తాను' అన్నాడట. సో మరో చరిత్ర తప్ప, రక్త చరిత్ర కాబోదు."

"ఓ.కే అంతా సరిగ్గా, సవ్యంగా జరిగితే శబ్దం సంగీతం అవుతుంది. కదలిక నృత్యం అవుతుంది. నిశ్శబ్దం ధ్యానం అవుతుంది. జీవితం సెలబ్రేషన్ అవుతుంది. లెట్స్ సెలబ్రేట్."

"యస్. ఎప్పుడు కలుద్దాం?"

"స్లీప్ ఈజ్ ట్రైయింగ్ 2 క్లోజ్ మై ఐస్. డ్రీమ్స్ ఆర్ కాలింగ్ మి. నో మోర్ డిఫెండింగ్. ఏమ్ గోయింగ్ 2 స్లీప్. బి4 దట్, ఐ ఉడ్ లైక్ 2 విష్ యు గుడ్ నైట్, స్వీట్ డ్రీమ్స్"

స్ఫూర్తి ఆన్‌లైన్ లోంచి వెళ్ళిపోయింది. ఆ ఛాటింగ్ వల్ల త్రివిక్రం మనసులోని ఒత్తిడి తగ్గి, తేలిక పడ్డట్టుగా అనిపించింది. మళ్ళీ ఇన్ బాక్స్‌లోని తన మెయిల్స్ చూసుకోసాగాడు. రెండు రోజుల క్రితం స్ఫూర్తి పంపిన ఉత్తరం స్పామ్ ఫోల్డర్‌లో కనిపించింది. వెంటనే నాట్ స్పామ్ బటన్ మీద క్లిక్ చేసి, మళ్ళీ ఇన్ బాక్స్‌లోకి వచ్చి ఆ ఉత్తరాన్ని ఓపెన్ చేసి చదివాడు.

'ఒకోసారి మన జీవితంలోని అన్ని తలుపులు మూసుకున్న భావన మనకి కలగొచ్చు. కానీ మూసుకున్న తలుపుల్లో వేటికీ తాళాలు వేసి ఉండకపోవచ్చు. అవి తట్టబడటానికి వెయిట్ చేస్తూండి ఉండచ్చు.

ఎక్కడున్నారు? ఎలా ఉన్నారు? ఎందుకో మీరు గుర్తొచ్చారు - **స్ఫూర్తి**'

త్రివిక్రం దానికి జవాబుగా ఇలా టైప్ చేసి పంపాడు.

సూర్యుడుకి ఉదయించటం, చేపలకి ఈత, పక్షులకి ఎగరటం, పిల్లలకి నవ్వటం, మొక్కలకి ఎదగటం ఎవరూ నేర్పకుండానే ఎలా బోధ పడతాయో. అలా మీలాంటి ఫ్రెండ్‌ని ఎంపిక చేసుకోవాలని నా మనసుకి సహజంగానే తట్టింది.

గుడ్‌నైట్

*త్రివిక్రం.*

కంప్యూటర్ ఆఫ్ చేసి త్రివిక్రం తండ్రి గదిలోకి వెళ్ళాడు. ఆయన నిద్రపోతున్నాడు. ఆయన ఒంటిమీద వాలిన దోమల్ని తరిమి ఫేన్ స్పీడు పెంచి తిరిగి తన గదిలోకి వచ్చి పడుకున్నాడు.

మర్నాడు ఉదయం సుందరేశ్వర్ చేసిన మరమరాల ఉప్మా తిని, కాఫీ తాగి త్రివిక్రం హాస్పిటల్‌కి బయలుదేరాడు. హాస్పిటల్ ఆవరణలో కారుని పార్క్ చేసి సరాసరి లేబ్‌కి వెళ్ళాడు. ఆ టెక్నీషియన్ ఇంకా రాలేదు. అక్కడినించి తనకి డ్యూటీ ఉన్న వార్డ్‌కి వెళ్ళాడు.

ఆ రోజు వచ్చిన రోగుల్లో ఓ ఆరేళ్ళ పిల్లవాడు కూడా ఉన్నాడు. వాడిని చూడగానే డౌన్స్ సిండ్రోమ్‌తో బాధపడే స్పెషల్ చైల్డ్ అని ఇట్టే గ్రహించాడు. వాడికి జ్వరం. వాడి గురించి ప్రశ్నిస్తే ఆ తల్లి చెప్పింది.

"వీడు నెల ముందే పుట్టాడండి. డెలివరీ సమయంలో బొడ్డు తాడు మెడ చుట్టూ బిగుసుకుంది. దాంతో బ్రెయిన్‌కి ఆక్సిజన్ సరిగ్గా సప్లయ్ కాక పోవడంతో సెరబ్రల్ పాల్సీ రోగి అయి మైల్డ్ రిటార్డేషన్ కలిగింది."

ఆ ఐదేళ్ళ పిల్లవాడి వంక చూసాడు త్రివిక్రం. వాడి చిరునవ్వు అయస్కాంతంలా ఆకర్షిస్తోంది.

"కంటికి కనపడని ఆకృతి మీద దాడి చేస్తూంటాడండి. మాట రాదు. మన భాష తెలియదు. చిన్న చిన్న పదాలు అస్పష్టంగా ఇప్పుడిప్పుడే మాట్లాడుతున్నాడు. ఎన్టీ రామారావు అంటే ఇష్టం. రోజుకో ఎన్టీఆర్ జానపద చిత్రం చూపించాల్సిందే మా ఇంటినిండా ఆయన బొమ్మలే. ఎప్పుడూ ఏది పెట్టినా మొత్తం తినడు. సగం ఇంకెవరికైనా పెట్టి తింటాడు. ఎవరైనా ఇష్టం అయితే వాళ్ళని ముట్టుకుని 'నువ్వు మంచి' అంటాడు. ఇష్టం లేకపోతే 'వెళ్ళు' అని కళ్ళు మూసుకుంటాడు. తరువాత 'వెళ్ళిపోయావు' అంటాడు. మళ్ళీ కళ్ళు తెరిచి చూసి 'వచ్చావా' అంటాడు."

"రంగులు గుర్తుపడతాడా?"

"ఏమో? గమనించలేదు."

"కలర్ బ్లాక్స్ చూపించి రంగులు నేర్పించండి. ఏ,బి,సి,డి బ్లాక్స్‌తో ఆల్ఫాబెట్‌ని గుర్తు పట్టడం నేర్పించండి. అలాగే అంకెలు కూడా. మనమెంత ప్రయత్నం చేస్తే అంతగా మాట్లాడగలడు. నాకు తెలిసిన ఇలాంటి ఓ పిల్లవాడికి ఐదో ఏటికల్లా మాటలు వచ్చాయి. పదో ఏటికి ఎల్.కె.జిలో చేర్చుకున్నారు. ఇంకొక గుడ్ న్యూస్ ఏమిటంటే వీళ్ళకి ఫైన్ ఆర్ట్స్ బాగా వస్తాయి. ఇందాక చెప్పిన పిల్లవాడు అద్భుతంగా ఈల పాట పాడతాడు. వీళ్ళకోసం ప్రత్యేక స్కూల్స్ ఉన్నాయి."

"థాంక్స్ డాక్టర్" ప్రోత్సాహపూర్వకమైన అతని మాటలకి ఆమె కృతజ్ఞతగా చూస్తూ చెప్పింది.

ఆ పిల్లవాడు తన మొహంలోని హావభావాలని రకరకాలుగా మారుస్తూండటం గమనించి అడిగాడు త్రివిక్రం.

"మీకో ఆయుర్వేద డాక్టర్ అడ్రస్ ఇస్తాను. ఓసారి ఆయనకి చూపించండి. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు? కాకపోతే కాకినాడ ప్రాంతంలో ఉంటాడాయన."

"నా పుట్టిల్లు కాకినాడ దగ్గర కొవ్వాడ."

"చిత్రాడ తెలుసా మీకు?"

"తెలీకే."

సెల్ ఫోన్లో నోట్ చేసుకున్న ఆ ఆయుర్వేద వైద్యుడి వివరాలు చెప్తే ఆమె రాసుకుంది.

"ఇంగ్లీషు వైద్యానికి లోబడని కొన్ని రోగాలు ఆయుర్వేదంలో నయమవుతాయి. ఆయన బాగా అనుభవజ్ఞుడు."

ఆ అబ్బాయి జ్వరం తగ్గడానికి మందులు రాసిచ్చాడు త్రివిక్రం. మరోసారి థాంక్స్ చెప్పి, పిల్లవాడిని ఎత్తుకుని వెళ్ళిందామె. వాళ్ళు వెళ్ళాక లేచి లేబ్‌కి వెళ్ళాడు. టెక్నీషియన్ అతన్ని చూడగానే, 'గుడ్ మార్నింగ్' చెప్పి ఓ కవరుని జేబులోంచి తీసి ఇచ్చాడు.

"మీకు నూరేళ్ళు ఆయుష్షు. నేనే మీ దగ్గరకి రాబోతున్నాను."

"థాంక్స్" చెప్పి త్రివిక్రం వెంటనే ఆ కవరుని తెరచి చూసాడు.

ఆ రిపోర్ట్ ప్రకారం కురంగేశ్వర్, త్రివిక్రమ్‌ల డి.ఎన్.ఏలు మేచ్ కాలేదు. వారిద్దరికీ ఎలాంటి సంబంధం లేదు.

నలుగురిలో ఇద్దరు కారని తేలింది. ఇంకా మిగిలిన ఇద్దరిలో ఎవరో ఒకరు తన తండ్రి అయి ఉండాలి. త్రివిక్రం లాబ్‌లోంచి బయటకి వచ్చాడు. జేబులోంచి సెల్‌ఫోన్ తీసి హరినాథ్ చిట్‌ఫండ్ కంపెనీకి ఫోన్ చేసి అవతలి వైపు వాళ్ళు లైన్‌లోకి వచ్చాక అడిగాడు.

"హరినాథ్‌గారు అమెరికానించి వచ్చారా? వారితో నేను ఓ సారి మాట్లాడొచ్చా?"

"మీరెవరు?"

"నా పేరు డాక్టర్ త్రివిక్రం. ఆయనతో నాకు వ్యక్తిగత పని ఉంది."

"మీకు తెలీదా? ఆయన పోయారు."

"మై గుడ్‌నెస్ ఎప్పుడు?"

"ఆయన అమెరికాలో ఉండగా మూడురోజుల క్రితం మాసివ్ హార్ట్ అటాక్ వచ్చి పోయారు. ఆయన శవాన్ని పిల్లలు ఇక్కడికే తెచ్చి దహనం చేసారు"

"దహనమైపోయిందా?"

"నా ముందే దహనమవుతోంది. నేను హిందూ స్మశానవాటికలో ఉన్నాను."

ఛే! తను క్రితం రోజే ఫోన్ చేయాల్సింది. కనీసం ఈ ఉదయమైనా చేయాల్సింది.

"వారి పిల్లల్ని నేనొకసారి కలవాల్సిన అవసరం ఉంది. వారి అడ్రస్, ఫోన్ నెంబర్ చెప్పగలరా?"

"జూబ్లీ హిల్స్ రోడ్ నెంబర్ ట్వెల్వ్‌లో వారి ఇల్లు. గాయత్రీ హాస్పిటల్ పక్క లేన్‌లో కుడివైపున నాలుగో భవంతి. నల్లగేటు ఇల్లు."

"వారి పిల్లల పేర్లు?"

"హరినాథ్ గారి పెద్దమ్మాయి మహిమ, కొడుకు నిక్షేప్."

"సాయంత్రం నేను వారిని కలవచ్చా? వారు అక్కడే ఉంటే ఫోన్ ఒకసారి ఇస్తారా?"

"ఒక్క క్షణం."

అతను ఎవరితోనో తన గురించి చెప్పటం త్రివిక్రం విన్నాడు. తరువాత ఓ ఆడ కంఠం వినబడింది.

"హాయ్"

"హలో! నా పేరు త్రివిక్రం. ముందుగా మీకు హార్ట్ ఫెల్ట్ కండోలెన్సెస్."

"థాంక్స్"

"నేను మిమ్మల్ని ఈ సాయంత్రం కలవచ్చా?"

"సాయంత్రం నా షెడ్యూల్ ఏమిటో నాకే తెలీదు. ఇంటికి రండి. నేనింట్లో ఉంటే కలవవచ్చు."

ఆమె ఉపయోగించిన స్కెడ్యూల్ అన్న పదం అమెరికన్ ఇంగ్లీష్ పదం. ఉచ్చరించిన ఇంగ్లీష్ అమెరికన్ ఏక్సెంట్‌లో ఉంది.

"ఆల్ రైట్. సాయంత్రం ఆరున్నరకి వస్తాను. మనం ప్రైవేటుగా మాట్లాడే అవకాశం దయచేసి నాకివ్వండి."

"డిడ్ యు సే ప్రైవేట్?" ఆశ్చర్యంగా అడిగింది మహిమ.

"అవును."

"దేని గురించి?"

"అప్పులు, డబ్బుకి సంబంధించిన లావాదేవీలు కావు. పర్సనల్ విషయం."

"ఆల్ రైట్."

"థాంక్స్ అండ్ ఎగైన్ మై కండోలెన్స్."

"యు ఆర్ వెల్‌కమ్."

అవతలి వైపు ఫోన్ కట్ చేసేసారు. డాక్టర్ విరజ ఎక్కడ డ్యూటీ చేస్తోందో తెలుసుకుని ఆ వార్డ్‌కి వెళ్ళాడు. రోగులతో ఆమె బిజీగా ఉంది.

"హలో"

"హలో. ఏమైంది?" అడిగింది ఓ రోగికి బి.పి చూస్తున్న ఆమె.

"బావాజీపాలెంకి వెళ్ళి మొన్న రాత్రే తిరిగి వచ్చాను."

"కురంగేశ్వర్ దగ్గరకి కదా మీరు వెళ్తానని చెప్పింది? ఆయన కలిసారా? డి.ఎన్.ఏ రిపోర్ట్ వచ్చిందా?" ఆసక్తి కనిపించింది ఆమె మాటల్లో.

"ఇందాకే వచ్చింది. నెగెటివ్."

"ఓ! ఐతే ఇంక ఇద్దరే మిగిలి ఉన్నారు కదా?"

"కాదు. ఒక్కరే"

"అదేమిటి? మొత్తం ముగ్గురా? నలుగురు కదా?"

"నలుగురే. కాకపోతే వారిలో ఒకరి దహన సంస్కారం ఈ క్షణంలో జరుగుతోందని తెలిసింది."

"అయ్యో? అదేంటి?"

హరినాథ్ గురించి చెప్పాడు.

"వాట్ ఏ పిటీ! ఆయన శవం చితికి ఎక్కక మునుపు తెలిసినా బావుండేది."

"అవును"

"నాలుగో అతని పేరు నవనీత్ కదా?"

"అవును. ఆయన ఎక్కడున్నారో తెలీదు. తెలుసుకోవాలి."

"అలెగ్జాండర్, కురంగేశ్వర్ చెప్పలేదా?"

"వాళ్ళిద్దరికీ తెలీదన్నారు."

"హరినాథ్ పోయాక ఇంక చెప్పేవారు ఎవరు?"

త్రివిక్రం జవాబు చెప్పలేదు.

సాయంత్రం సరిగ్గా ఆరున్నరకి హరినాథ్ ఇంటి సందులోకి తన కారుని తిప్పబోయి త్రివిక్రం ఆగాడు. ఆ సందు నిండా కార్లు పార్క్ చేసి ఉన్నాయి. మెయిన్ రోడ్డు మీద కూడా కార్లే. రెండు సందుల అవతల కారు పార్క్ చేసి నడిచి వచ్చాడు.

ఆ ఇంట్లోని విశాలమైన ముందు గదిలో సందర్శకులతో మాట్లాడే ఓ పాతికేళ్ళ యువతిని త్రివిక్రం చూసాడు. ఆమె జీన్స్ పేంట్, టీ షర్ట్‌లని ధరించి ఉంది. మొహాన బొట్టులేదు. భుజం దాకా కత్తిరించుకున్న జుట్టుని, హెయిర్ స్టయిల్‌ని బట్టి ఆమె అమెరికా నించి వచ్చిందని, ఆమే హరినాథ్ కూతురు మహిమ అని త్రివిక్రం భావించాడు. చాలామంది తమ కండోలెన్సెస్ తెలియ చేయడానికి వచ్చారు. వారితో కలిసి త్రివిక్రం తన వంతు రాగానే మహిమ దగ్గరకి వెళ్ళాడు.

"మై హార్ట్ ఫెల్ట్ కండోలెన్సెస్" చెప్పాడు.

ఆమె అందరితో కరచాలనం చేసినట్లుగానే, త్రివిక్రంతో కూడా కరచాలనం చేసి చెప్పింది.

"థాంక్ యు. నాన్నగారు మీకు ఎలా తెలుసు?"

"నేనాయన్ని ఇంతదాకా చూడలేదు. మధ్యాహ్నం మీరు స్మశానంలో ఉండగా ఫోన్ చేసింది నేనే. నా పేరు త్రివిక్రం. మీతో వ్యక్తిగతంగా, ఏకాంతంలో మాట్లాడాలి. దయచేసి రెండు నిముషాలు ఆ అవకాశం ఇస్తారా?"

ఆమె అతన్ని నిశితంగా చూస్తూ అడిగింది.

"వాటీజ్ ఇట్ అబౌట్?"

"పర్సనల్."

"బి స్పెసిఫిక్. ఉడ్ యూ ప్లీజ్?" ఆమెలో కొద్దిగా చిరాకు త్రివిక్రంకి కనిపించింది.

"నథింగ్ ఫైనాన్షియల్."

"బి మోర్ స్పెసిఫిక్, ఇఫ్ యు మే" అదే చిరాకు.

"ఆయన నా తండ్రి అయ్యే అవకాశం ఫిఫ్టీ. కాబట్టి ఆ విషయంలో మీ సహాయం కోరడానికి వచ్చాను."

మహిమ మొహంలోని చిరాకు మాయమై విభ్రాంతి చోటు చేసుకుంది. నోరు విప్పి ఏదో అడగబోయి ఆగిపోయి చెప్పింది.

"ఉడ్ యు బి గుడ్ ఇనఫ్ టు వెయిట్ ఫరే వైల్?"

"ఎట్ దిస్ పాయింట్ ఆఫ్ టైం, ఐ హేవ్ గాట్ ఆల్ ది టైం ఇన్ ది వరల్డ్." నవ్వుతూ చెప్పాడు.

ఒక్క క్షణం ఆలోచించి చెప్పింది మహిమ.

"మా తమ్ముడు వచ్చాక మనిద్దరం కలిసి మాట్లాడదాం. పనిమీద బయటికి వెళ్ళాడు. ఐ థింక్ హి ఈజ్ బేక్ ఆన్ హిస్ వే."

"ఓ.కే"

త్రివిక్రం చూస్తుండగానే హరినాథ్ ఫోటో ఫ్రేం ఎవరో తెచ్చారు. అప్పటికప్పుడు దాన్ని ముందు గదిలో తలుపు మీద, హరినాథ్ తండ్రి రఘునాథ్ ఫోటో పక్కన తగిలించారు.

ఇరవై నిముషాల తర్వాత ఆ గదిలోకి వచ్చినతన్ని చూసాడు. అతని హెయిర్ కట్‌ని బట్టి అది అమెరికాలో చేయించే కట్ అని కూడా త్రివిక్రం గ్రహించాడు. అతను మహిమ సోదరుడని ఇట్టే తెలిసిపోతోంది. నాలుగైదు నిమిషాల తర్వాత అతను త్రివిక్రం దగ్గరకి వచ్చి చిరాగ్గా అడిగాడు.

"మీరు మరో రోజు రావచ్చుగా? ఇంత విషాదంలో ఆ విషయం ఇప్పుడే మాట్లాడాలా?"

"ఇప్పటికే లేట్ అయిపోయింది. జస్ట్ రెండు నిముషాలు చాలు."

"టైం గురించి కాదు. ఇలాంటివి ఇప్పుడే మాట్లాడాలా అని? సరే రండి."

త్రివిక్రం అతన్ని అనుసరించి లోపలికి వెళ్ళాడు. నిక్షేప్ అతన్ని ఓ గదిలోకి తీసుకెళ్ళాడు. అది బెడ్ రూం అని త్రివిక్రం గ్రహించాడు. బల్లమీది అమెరికన్ టూరిస్టర్ సూట్ కేసులని చూసి అది గెస్ట్ బెడ్‌రూం అని, అందులోనే అతడు దిగాడని కూడా

ఊహించాడు. గోడకి వేలాడే అతను భార్యతో తీయించుకున్న ఫోటోని చూసి అది అతనికి కేటాయించబడ్డ గది అని కూడా గ్రహించాడు.

అతను బయటకి వెళ్ళి కొన్ని క్షణాల్లో తన సోదరితో వచ్చాడు.

"ఇఫ్ యు ఆర్ ఏ స్విండర్, యు విల్ హేవిట్, ఐ షుడ్ వార్న్ యు." నిక్షేప్ కోపంగా హెచ్చరించాడు.

త్రివిక్రం చిన్నగా నవ్వి జేబులోంచి తన విజిటింగ్ కార్డులని తీసి ఇద్దరికీ చెరొకటి అందించాడు.

"కూర్చోండి" మహిమ చెప్పింది.

ముగ్గురూ ఎదురు బొదురుగా ఉన్న సోఫాల్లో కూర్చున్నాక త్రివిక్రం చెప్పాడు.

"మీ నాన్నగారి గురించి మీకు ఎంత తెలుసో నాకు తెలీదు. ముఖ్యంగా ఆయన పెళ్ళికి పూర్వం విద్యార్థి దశలోని సంగతులు. నేను చెప్పేది మిమ్మల్ని బాధిస్తే నన్ను క్షమించండి. ఎందుకంటే అసలే బాధగా ఉన్న మిమ్మల్ని ఇంకాస్త బాధించడం నా అభిమతం కాదు."

"ఓ.కే?"

"మీ నాన్నగారు కాలేజీ విద్యార్థిగా ఉండగా నా తల్లిమీద బలాత్కారం చేసిన నలుగురిలో ఒకరని మీకు తెలుసా?"

ఆ ప్రశ్న వినగానే ఇద్దరూ విభ్రాంతికి గురయ్యారు.

"వాట్ ది హెల్ డు యు మీన్?"

మహిమ తన తమ్ముడు చేతిని తాకి అతని మాటలని ఆపి సహనంగా అడిగింది.

"ఎక్స్‌ప్లెయిన్ ఇన్ డీటైల్."

హరినాథ్ బికాం చదువుతుండగా తన తల్లి ప్రమీలని రేప్ చేసిన సంఘటనని టూకీగా చెప్పాడు.

"ఆనాటి దినపత్రికల జిరాక్స్ కాపీలు నా కారులో ఉన్నాయి. అవి చూస్తే నేను స్విండ్లర్‌ని కాదని అర్థమవుతుంది."

వెంటనే నిక్షేప్ చేతిని చాపి అడిగాడు.

"కీస్. కార్ నంబర్."

త్రివిక్రం సందేహించకుండా కారు తాళం చెవిని ఇచ్చి, నంబర్‌ని చెప్పి, ఎక్కడ పార్క్ చేసాడో కూడా చెప్పాడు. అతను బయటకి వెళ్ళాక మహిమ తన కుడిచేతిని నోటికి అడ్డుగా ఉంచుకుంది.

నిక్షేప్ కన్నా ఆమె ఎక్కువ షాక్‌కి గురైందని, తను చెప్పిన విషయాలు ఆమెకి తెలీవని త్రివిక్రం గ్రహించాడు.

"అలెగ్జాండర్, కురంగేశ్వర్, మీ నాన్నగారు, నవనీత్ అనే నలుగురు మిత్రులు ఆటోలో ఒంటరిగా వెళ్ళే నా తల్లిని ఆపి అర్ధరాత్రి పబ్లిక్ గార్డెన్స్‌లో రేప్ చేసారు. మీ తాతయ్య ఐ.పి.ఎస్ ఆఫీసర్ కాబట్టి మీ నాన్నగారికి శిక్ష పడకుండా కాపాడారు. ఆ కేసు నించి మీ నన్నగార్ని ఎలా రక్షించారు అన్నది 1980 దినపత్రికల్లోని వార్తలని చదివితే స్పష్టం అవుతుంది."

"మా నాన్నగారు పోయేదాకా ఆగి, ఇప్పుడు రావడం వెనక గల మీ ఉద్దేశం ఏమిటి? షేర్ ఇన్ ది ప్రాపర్టీ?" అడిగింది మహిమ.

"కానేకాదు. నేను ఆలస్యంగా రావడానికి కారణం చెప్తాను వినండి. అప్పుడు మీకు నేనెందుకు వచ్చానో అర్థం అవుతుంది."

త్రివిక్రం క్లుప్తంగా తన తల్లి రోడ్డు ప్రమాదంలో మరణించడం, ఆమెకి జరిగిన పోస్ట్‌మార్టంలో గర్భసంచి లేదని తెలియటం, అనేక ప్రయత్నాలు చేసి అలెగ్జాండర్‌ని, కురంగేశ్వర్‌ని కనుక్కుని డి.ఎన్.ఏ టెస్ట్‌లు చేయడం, వారిద్దరిలో ఎవరూ తన తండ్రికాదని తెలియడం, హరినాథ్ కోసం చిట్ ఫండ్ కంపెనీకి ఫోన్ చేస్తే అమెరికాలో మరణించిన ఆయన డెడ్ బాడీని తీసుకు వచ్చారని తెలియడందాకా చెప్పాడు. మధ్య మధ్యలో త్రివిక్రం వదిలేసిన భాగాలని మహిమ ప్రశ్నలు వేసి తెలుసుకుంది. ఒక్కో విషయం వింటూంటే

ఆమె మొహం పాలిపోసాగింది. మధ్య మధ్యలో 'సో షేమ్ ఫుల్... సో షేమ్‌ఫుల్' అని బయటకి అనసాగింది. త్రివిక్రం మొత్తం చెప్పాక ఆమె కళ్ళు తడి అయ్యాయి.

తన చేతిని చాపి త్రివిక్రం చేతిమీద వేసి చెప్పింది.

"ఐ ఏమ్ సో సారీ ఫర్ యు రియల్లీ సారీ."

నిక్షేప్ మళ్ళీ ఆ గదిలోకి వచ్చి త్రివిక్రంకి కారు తాళం చెవులు, కార్లోంచి తెచ్చిన ప్లాస్టిక్ ఫోల్డర్‌ని మహిమకి ఇచ్చి చెప్పాడు.

"వీటిని నేను చదివాను. ఇవి నిజంగా ఆనాటి దినపత్రికల్లోవా లేదా కుక్డ్ అప్‌వా అన్నది చెక్ చేయాలి."

"మానించి మీకేం సహాయం కావాలి?" అడిగింది మహిమ త్రివిక్రంని.

"నాకీ సమాచారం తెలిసేసరికే మీ నాన్నగారి దహనం మొదలైంది. నాకాయన డి.ఎన్.ఏకి ఓ స్పెసిమన్ కావాలి. అందుకు మీ సహకారం కావాలి."

"ఎలాంటిది?"

"మీ బ్లడ్ సేంపుల్. లేదా మీ బ్రదర్‌ది. మన డి.ఎన్.ఏలు కలిస్తే నా తండ్రి ఎవరో తెలుస్తుంది."

"కానీ మేము ఆయన స్వంత పిల్లలం కాము. మా అమ్మకి సంతాన యోగం లేదని తెలియగానే ఆవిడ అక్క పిల్లలమైన మా ఇద్దర్నీ వాళ్ళు దత్తత తీసుకుని స్వంత పిల్లలుగా పెంచారు. అప్పటికే మా స్వంత అమ్మ పోయి మా బయోలాజికల్ ఫాదర్ ఇంకో పెళ్ళి చేసుకున్నారు కాబట్టి ఆయనకీ ఈ ఏర్పాటు నచ్చింది."

"ఓ! అలాంటప్పుడు హరినాథ్ స్పెసిమనే అవసరం అవుతుంది."

"వాట్స్ గోయింగాన్ హియర్?" అసహనంగా అడిగాడు నిక్షేప్ మహిమని.

"ఐ విల్ ఎక్స్‌ప్లెయిన్ లేటర్." అని జవాబు చెప్పి మహిమ త్రివిక్రంతో చెప్పింది.

"ఎలా? ఆయన పోయాక అవేమీ మాదగ్గర లేవుగా?"

"ఆయనకి తోడబుట్టిన వారు ఉన్నా చాలు."

"సారీ అగైన్! ఉన్న ఒక్క చెల్లెలు పేంక్రియాస్ పాడై క్రితం ఏడాదే పోయింది."

త్రివిక్రం కొద్దిసేపు ఆలోచించాడు.

"అమెరికాలో ఆయన చికిత్స పొందిన హాస్పిటల్‌లో ఆయన టిష్యూలు, బ్లడ్ సేంపుల్స్ ఉండచ్చు."

"ఆయనకి అమెరికాలో ఎన్నడూ ఎలాంటి జబ్బూ చేయలేదు. హాస్పిటల్‌కే వెళ్ళలేదు. ఇంత మాసివ్ హార్ట్ అటాక్ వచ్చేదాకా అసలు మాకు ఆయనలో ఇంత అనారోగ్యం ఉందనే తెలీదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోమన్నా అక్కడకి వచ్చినప్పుడు తీసుకునేవారు కారు."

"ఆయన వాడిన దుస్తులమీద ఆయన వెంట్రుకలు ఉండచ్చు పడుకున్న పక్కమీద కూడా, దానిమీద ఇంకెవరూ పడుకోకబోతే... ఆయన శవాన్ని తెచ్చిన శవపేటికలో..."

"శవపేటికని ఉంచకూడదని మా బంధువులు దాన్ని కాల్చేయమన్నారు. దాన్ని కూడా చితిలో వేసి కాల్చేసాం. నేను అమెరికాకి వెళ్తేకానీ మీరు అడిగింది మా ఇంట్లో ఉందేమో చూసి ఇవ్వగలనో లేదో చెప్పలేను."

"ఇక్కడ అలాంటివేమీ లేవా?"

"నాకు తెలిసి లేవు. వెంట్రుకలు ఆయన పక్కమీద దొరకొచ్చు. కానీ అవి ఆయనవే అని గేరంటీ లేదు. ఎవరెవరు ఈ ఆర్నెల్లల్లో దాని మీద పడుకున్నారో? అనేకమంది బంధువులు వారి పిల్లలు వచ్చినప్పుడు ఆయనలేరు కాబట్టి గెస్ట్ రూంగా ఆయన పడకగదినే వాడేవారు."

"అయితే లాభం లేదు. మీరు తిరిగివెళ్ళాక నేనడిగినవి సేకరించి పంపితే, ఐ షల్ బి గ్రేట్‌ఫుల్ టు యు."

మహిమ నుదుటి మీద కొట్టుకుని చెప్పింది.

"టెన్త్ డేకి మా వారు ప్రిన్స్‌టన్ నుంచి వస్తున్నారు. మేముండేది న్యూజెర్సీలో. ఆయనకి ఈ విషయం చెప్పి తెమ్మంటాను. మా వారు కూడా ఎనస్థీషియన్."

"దట్ విల్ బి ఏ వెరీ బిగ్ హెల్ప్." ఆనందంగా చెప్పాడు త్రివిక్రం.

"ఈ రాత్రి మాట్లాడినప్పుడు చెప్తాను. ఇదే కదా మీ ఫోన్ నెంబర్?" అతను ఇచ్చిన కార్డులోని నంబర్‌ని చూపిస్ చెప్పింది.

"యస్ థాంక్స్ ఫర్ యువర్ టైం. ఐ యామ్ డన్." త్రివిక్రం లేచాడు.

మహిమ కూడా లేచి త్రివిక్రంని ఓసారి కౌగలించుకుని చెప్పింది.

"మీరు నా బ్రదర్ అయ్యే అవకాశం ఉండటం ఆశ్చర్యంగా ఉంది."

త్రివిక్రం తెల్లబోతూ చూస్తున్న నిక్షేప్‌తో కరచాలనం చేయబోతే చెప్పింది మహిమ.

"గివ్ హిమ్ ఏ హగ్ నిక్."

నిక్షేప్ అయిష్టంగానే త్రివిక్రంని కొద్దిక్షణాలపాటు కౌగలించుకున్నాడు.

"ఐ విల్ వెయిట్ ఫర్ యువర్ కాల్." చెప్పాడు త్రివిక్రం బయటికి వెళ్ళబోయే ముందు.

"అండ్ యు విల్ గెటిట్" హామీ ఇచ్చింది మహిమ.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in